# అత్తగారూ నక్సలైట్లూ

భానుమతీ రామకృష్ణ



ఆ రోజు పేపర్లో నెల్లూరుజిల్లానుండి నెక్సలైట్లని పోలీసులు అనుమానిస్తున్న యిద్దరు వ్యక్తులు తెల్లటి బట్టల్తో నల్లటి కండ్లజోళ్ళతో మద్రాసువెళ్ళే బస్సు ఎక్కి పారిపోయారని నేను చదవడం విన్న మా అత్తగారు, "ఓరి వీళ్ళ తాళ్ళు తెగా! మద్రాసుక్కూడా వచ్చారా! యింకేముంది?" అంటూ ఖంగారు పట్టం మొదలెట్టారు. వంటవాణ్ణి కేకేసి, వంటింటి బయట పాత్రసామాను ఒక్కటి గూడా వుంచొద్దు, అన్నీ లోపల పడెయ్యమని చెప్పారు. పనిమనిషిని పిలిచి, బట్టలు బయట ఆరేయ్యొద్దని చెప్పారు. ఘూర్కావాణ్ణి కేకేసి, ఎవరు తెల్లబట్టల్తో, కళ్ళజోళ్ళతో వచ్చినా లోపలికి వదలొద్దనీ, లోపలి కెళ్ళాలని గొడవ జేస్తే మెడబట్టి గెంటెయ్యమనీ చెప్పారు.

"అదేంటి, పెద్దమ్మగారూ! ఆ పారిపోయిన నెక్సలైటిద్దరూ మీ పాతగుడ్డల కోసం, పాత్ర సామాన్లకోసం నేరుగా మీ యింటికే వస్తున్నట్లు అడావిడి చేస్తున్నారే! ఆళ్ళూ మణుసులే నమ్మా! ఆళ్ళు మామూలు దొంగలుగారు. ఆళ్ళల్లో శానా గొప్పగొప్పోళ్ళూ, సదువుకునోళ్ళూ వున్నారంట," అన్నాడు హాల్లో సోఫాలు దులుపుతున్న మా పనివాడు, మా అత్తగారి హడావిడికి ఒళ్ళుమండి. తక్షణం మా అత్తగారు వాడివైపు అనుమానంగా చూశారు. 'వాడూ ఒక నెక్సలేటా....!' అన్న భావన ఆమె చూపుల్లో కనిపించింది. ఆ పని వాడిమీద కూడా ఓ కన్ను వుంచాలి అనే అర్థంతో నా వైపు చూశారు.

టెలిఫోన్ బెల్ మోగింది. తీశాను.

మా బావగారు నెల్లూరునుంచి కుటుంబ సమేతంగా దక్షిణదేశ యాత్రలు చేయడానికి వచ్చారట! మమ్మల్ని చూచి పోదామనివస్తే ఘూర్కావాడు తరిమేశాడట. తను సొంత వాడినని చెప్పి లోపలికి రాబోతే మెడబట్టి గెంటాడట. వాడు గెంటడంలో తన కళ్ళజోడు కిందపడి పగిలిపోయిందట! "యిదేనా మీరుచేసే బంధు మర్యాద! ఎంత భాగ్యవంతులైనా, ఎంత ఘూర్కాల్ని పెట్టినా, వచ్చిన వాళ్ళను కుక్కల్లా తరిమిస్తారా! బంధువుల బాధ తప్పించుకోడానికా ఘూర్కాల్ని పెట్టారు? యిక యీ జన్మకి మీ గడపలో కాలుపెట్టకుండా బుద్ధి చెప్పారు" అంటూ ఫోన్ పెట్టేశాడు.

నాకు నోటమాట రాలేదు!

"ఏమిటే! ఎవరా ఫోన్‌చేసిందీ" అని అడిగారు మా అత్తగారు. ఒక్క క్షణం ఆవిడ మీద చాలా కోపం వచ్చింది నాకు. మా బావగారు మాట్లాడిందంతా చెప్పాను.

"హయ్యొ, యీ ఘూర్కా ముండావాణ్ణి దొంగల్దోలా! మన సొంత వాళ్ళొస్తే పొమ్మన్నాడా? చెప్పక పోయావా, యిట్లాంటి సంగతనీ?"

"నే చెప్పేలోపుగానే ఫోన్ పెట్టేశాడు," అన్నాను.

"హయ్యొ, నెత్తి రాతా! అయినా వాడికా తొందరేమిటీ! 'మనం ఎందుకిట్లా చేశామో అర్థం చేసుకోవక్కర్లా? దొంగలు చెప్పి వస్తారా ఏమిటీ! పైగా వాళ్ళు మామూలు మనుషులకంటే పెద్ద మనుషుల్లాగా వస్తున్నారాయె! దొంగ లెవరో, దొర్లెవరో మన కెట్లా తెలుస్తుందీ! మా కాలంలో దొంగలైతే నల్లగా, నాపరాళ్ళలాగా, పట్టుకుంటే చిక్కకుండా జారిపోయి పారిపోయేందుకు ఒంటినిండా నూనె రాసుకుని, దొంగ తనాలకూ, దోపిళ్ళకూ వస్తూండే వాళ్ళు" అని మా అత్తగారు చెప్తూంటే మళ్ళీ టెలిఫోన్ మోగింది.

యీసారి మాకు తెలిసిన వాళ్ళూ, మావారికి బాగా స్నేహితులూ యింటికి వస్తే ఘూర్కావాడు చాలా విదిలించుకుని, "జావ్! జావ్!" అంటూ గెంటేశాడనీ, ఘూర్కాలకు పెద్ద మనుషుల దగ్గిర ఎలా మసులుకోవాలో చెప్పమనీ చెప్పి, చాలా నిష్ఠురంగా మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

యీసారి మా అత్తగారు అడక్కుండానే విషయం అంతా చెప్పాను.

"ఊఁ!....సరే ఆ ఘూర్కావాణ్ణి యిట్లా పిలువు," అన్నారు మా అత్తగారు ఏదో ఆలోచిస్తూ. ఘూర్కాని పిల్చాను. వాడితో చెప్పారు, బంధువులూ తెలిసినవాళ్ళూ వస్తే లోపలికి వదలమని. వాడు ఒక్కక్షణం అయోమయంగా ఆమెవేపూ, నావేపూ చూసి,



"అచ్ఛా, అమ్మా!" అంటూ గేటువేపు వెళ్ళిపోయాడు!

మా అత్తగారు భోంచేసి కలకండ పెళ్ళ బుగ్గనతోసి హాల్లో కొచ్చారు.

మా యింటి ముందున్న 'లాన్'లో యిద్దరు మగవాళ్ళు తెల్లటి దుస్తుల్లో, టోపీలు పెట్టుకుని, మా యింటివేపు చూస్తూ, మేడ మీద ఎన్ని గదులున్నాయో, కింద ఎన్ని గదులున్నాయో లెక్కపెడుతున్నారు.... మా అత్తగారి ప్రైప్రాణాలు పైన్నే పోయాయి.

అన్నం తిని చెయ్యి కడుక్కుంటున్న నా దగ్గిరికి హడావిడిగా పరుగెత్తుకొచ్చి నా చెవులో చెప్పారు—"ఆ వచ్చిన వాళ్ళిద్దరూ పారిపోయారని పేపర్లో వేసిన నెక్సలైట్లలాగా తెల్లటి బట్టల్తో, టోపీల్తో, కళ్ళజోళ్ళతో, అచ్చు అట్లాగే వున్నారు, కావాలంటే నువ్వు కిటికీ దగ్గిర్నుంచి చూడు. బాగా కనిపిస్తారు," అంటూ కిటికీ దాకా నన్ను కాస్త వంగి నడవమన్నారు, వాళ్ల కంటబడకుండా. అప్పుడే అన్నం తిన్న నేను వంగలేని స్థితిలో అవస్థపడి ఎట్లాగో కిటికీ దగ్గిరికి శరీరాన్ని చేరేసి, బయటికి తొంగి చూశాను. నిజమే! ఆమె ఖంగారుకు కారణం లేకపోలేదు. యిప్పుడేం చేయడం! ఒకవేళ వాళ్ళు మామూలు మనుషులై వుంటే అనవసరంగా అభాసు అవుతుంది. నా సందేహాన్ని వెలిబుచ్చాను.

"నీకేమన్నా మతిపోయిందంటే? వాళ్లు మామూలు మనుషులైతే నేరుగా వస్తారు, మనతో మాట్లాడతారు. పెద్దమనిషి తరహాగా! చూడు, చూడూ! వాళ్ళిద్దరూ, మేడమీద ఎన్ని గదులున్నాయో? ఎట్లా వెళ్ళి దొంగతనం చెయ్యొచ్చు అన్నట్లు ఒకళ్ళకొకళ్ళు మార్గాలు బోధించుకుంటున్నారే!" అని ఆమె చెపుతూ వుంటే, యింటి వేపు వాళ్ళిద్దరూ చూసి మాట్లాడుకోడం అట్లాగే కనిపించింది.

"ఇంకా చూస్తావేంటే? తొందరగా అబ్బాయికి ఫోన్ చెయ్యి," అంటూ మా అత్తగారు నన్ను తొందర చేయడం మొదలెట్టారు. ఎట్లాగో ఆ టోపీల వాళ్ళ కంటబడకుండా హాల్లో కొచ్చి, ఫోన్ చేసి, మా వార్ని అర్జంట్‌గా యింటి వేపు రమ్మని చెప్పాను.

"సంగతేమిటి!" అన్నారు.

"యింటి వేపు వస్తే మీకే తెలుస్తుంది" అని పెట్టేశాను ఫోన్.

పక్క కాంపౌండే గనక మా వారు హడావిడిగా వచ్చేశారు. వారితో మా మేనేజరు కూడా వచ్చాడు, నా సంతకా లేవో కావాలని.

మా వార్ని చూస్తూనే ఆ టోపీలవాళ్ళు "హల్లో సార్!" అంటూ మా వారి దగ్గరికి రావడం, మా వారూ, "హల్లో, సార్! మీరింకా షూటింగ్ ఆరంభించలేదా? ఏరీ మీ

బృందం అంతా? యింకా రాలేదా?" అంటూ వాళ్ళతో మాట్లాడటం చూసి మా అత్తగారూ నేనూ తెల్లబోయాం.

తీరా మా వారూ, వాళ్ళూ మాట్లాడిన దాన్ని బట్టి వాళ్ళెవళ్ళో ఫిలింప్రొడ్యూసరూ, డైరెక్టరూ మా యింటి ముందు భాగం వాళ్ళ పిక్చెరు కోసం షూట్ చేసుకోడానికి వచ్చారట.

వాళ్ళతో మాట్లాడి మా దగ్గిరికొచ్చి, "ఎందు కంత అర్జంట్‌గా రమ్మని ఫోన్ చేశావ్?" అని అడిగారు మా వారు.

ఏం చెప్పాలో తోచక మా అత్తగారి వేపు చూశాను. ఆవిడ కాస్త తెప్పరిల్లి, "అదేరా! వాళ్ళెవరో మాకు తెలీకపాయే! వాళ్ళిద్దరూ యింటి వేపు చూస్తూ నిలబడితేనూ!—"

"దొంగలను కున్నావు అంతేనా?" అన్నారు మా అత్తగారి మనస్తత్వం బాగా తెలిసిన మావారు నవ్వుతూ.

"అవున్రా! యీ రోజు పేపర్లో యిద్దరు తెల్ల పంట్లాలూ, టోపీలూ, కళ్ళ జోళ్ళు వేసుకుని—"

"అవు నవును! కరెక్ట్ కరెక్ట్! పెద్దమ్మ గారూ! మీ రనుకున్నదాంట్లో పొరపాటేం లేదు. ఆ గుర్తులన్నీ వీళ్ళిద్దరి దగ్గిరా కొట్టొచ్చి నట్లు కనిపిస్తున్నాయి. కాలం మారుతోంది. యిదే రష్యాలో అయితే—" అని మాటకు ముందు రష్యాపేరు చెప్పందే మాట్లాడని మా మేనేజరు యింకా ఏమో చెప్పబోతూంటే—

"నువ్వుండవయ్యా! అసలే అనవసరంగా ఆమె భయపడుతూ వుంటే లేనిపోనివి చెప్తావే! ప్రొద్దుట ఆఫీసు కొచ్చింది మొదలు నీకు రష్యా గురించీ, రాజకీయాల గురించీ మాట్లాట్టం తప్ప వేరే పనిలేదు."

రష్యా మాట వినగానే మేనేజరు ముఖం ఎర్రజెండాలా జేవురించింది.

"అదేమిటి, సార్! రష్యా గురించి నేనేం మాట్లాడాను? అక్కడ వర్కర్సుకు వాళ్ళిచ్చే సౌకర్యాలూ, సమాన హక్కులూ, వాళ్ళు పని చేసే పద్ధతులూ గురించి మాట్లాడాను."

"ఆ పద్ధతుల్లో మీరు పని చేయగలర టయ్యా! నెలకు పదిహేను రోజులు 'లీవు' పెట్టి యింట్లో కూర్చోగలరా! అసలు 'లీవు' యిచ్చే వాడూ, పుచ్చుకునే వాడూ అంటూ వుంటే గదయ్యా! రష్యాలో రెక్కాడితేనే డొక్కాడుతుంది. లేకపోతే కాళ్ళు కడుపులో పెట్టుకొని పడుకోవాల్సిందే! అసలు మీ అందరికీ రోగం కుదరాలంటే రష్యానుంచి కొందరు ఫ్యాక్టరీ వర్కర్సును పిలిపించి, మన యిండియాలో ఫ్యాక్టరీకి ఒకడి చొప్పున పెట్టి, మనవాళ్ళని వాళ్ళ కింద పని చెయ్యమని చెప్పాలి. అప్పుడు గాని మీ అందరికీ తెలిసిరాదు. దూరపు కొండలు నునుపు. కడుపులో చల్ల కదల కుండా కబుర్లతో కాలక్షేపం చేయడానికి రష్యావాళ్లు టైమ్ యివ్వరయ్యా! అక్కడ మనుషులు మరల్లాగా పని చేస్తారు. గుర్తుంచు కోండి," అంటూ మా వారు రష్యా భక్తుడైన మా మేనేజరు కొక 'డోస్' యిచ్చారు.

వెలవెల బోతున్న మేనేజరు, "అదేమిటి, సార్! నే నేదో తమాషాకి మాట్లాడు తుంటాను. మీరు సీరియస్‌గా తీసుకొన్నారు."

"అబ్బే! నేనూ తమాషాగానే నీకూ వున్న విషయం చెప్పాను. అంతే!" అని మేనేజరుతో అని, "అమ్మా! వాళ్లు దొంగలు కారు, మనకు తెలిసిన వాళ్ళు, మనకు దగ్గిర బంధువులు కూడా. ఆ యిద్దర్లో ఒకాయన మన పరంధామయ్య బాబాయి అల్లుడే!" అని మా వారు చెప్తూంటే—

"ఎట్టాగూ! మరి అట్లాంటివాడు నేరుగా వచ్చి పలకరించి పోవచ్చుగా! అయితే వీడి కిప్పుడెంతమంది పిల్లలూ!"

"అదంతా నేనడగలేదమ్మా......వాళ్ళకి మంచి నీళ్ళూ మజ్జిగా ఏదైనా కావాలంటే యిప్పించండి......కుర్చీలు నాలుగు అటు పంపించండి-" అని మాతో చెప్పి, "సంత కాలు తీసుకుని త్వరగా రావయ్యా!"—అని మేనేజరుతో చెప్పి ఆఫీసు వేపు వెళ్ళి పోయారు మావారు.

"ఓరి వీళ్ళింట వానగురవా!-అన్యాయంగా దొంగలను కున్నానే!"

"మీరనుకున్న దాంట్లో అన్యాయం ఏమీ లేదు పెద్దమ్మగారూ!-యిది జరిగిన సంగతే! ఎప్పుడో కాదు ఎక్కడో కాదు, మా బావ మరిదిగారి వూర్లో వాళ్ళ పక్కింట్లోనే జరి



గింది" అంటూ ముక్కుపొడి డబ్బా మూత తీస్తూ సోఫాలో కూలబడ్డాడు మేనేజరు.

మా అత్తగారు ఆత్రుతగా, "ఏం జరిగిందయ్యా? త్వరగా చెప్పు!" అంటూ అతనికెదురుగ్గా వున్న సోఫాలో కూర్చున్నారు.

"ఏం చెప్పమంటారు పెద్దమ్మగారూ! ఆ కథ విని పాపం ఆ పిల్ల జీవితం ఏమైపోయిందోనని నేనూ, మా ఆవిడా చాలా బాధపడ్డాం. దుర్మార్గుడు, సూటూ బూటూ వేసుకుని స్టయిల్‌గా వాళ్ళకు దగ్గర బంధువననీ, మద్రాసులో పెద్ద ఉద్యోగం చేస్తున్నాననీ, శెలవుల్లో వచ్చాననీ, తనకు నా అన్న వాళ్ళంతా పోయారనీ చెప్పి, వాళ్ళు నమ్మేట్లు వాళ్ళ బంధువుల పేర్లూ వరసలన్నీ చెప్పి వాళ్ళింట్లో దిగాడట. బంధువుల కుర్రాడేగదా, అని వాళ్ళు చాలా మర్యాద చేశారట. యింట్లో బంగారు బొమ్మలాంటి పెళ్ళి యీడు కొచ్చిన పిల్లకూడా వుంది. ఆ పిల్లను పెళ్ళాడమని ఎప్పుడో అతని పినతల్లి మరీమరీ చెప్పి ప్రాణాలు విడిచిందని చెప్పి వాళ్ళను నమ్మించాడు. వాళ్ళూ అంత పెద్ద వుద్యోగం చేసే అతను అల్లుడు కావడం అదృష్టంగానే భావించారు. ఎటూ కాబోయే భర్తే గదా అనుకుని ఆ పిల్లకూడా 'బావా, బావా' అంటూ చనువుగా అతనితో మాట్లాట్టం, అతనికేం కావాలో చూట్టం మొదలెట్టింది. ఒక రోజు యింట్లో పెద్దవాళ్ళు లేని టైమ్ చూసి బలవంతంగా ఆ పిల్ల శీలం చెడగొట్టాడు. యీ విషయం పెళ్ళిదాకా రహశ్యంగానే వుంచమని ఆ పిల్లను బ్రతిమాలుకున్నాడు."

"యింతకీ ఆ బుద్ధిలేని గాడిదెట్లా ఒప్పుకుందీ!" అని అడిగారు మా అత్తగారు.

"బావనే గదా అంటూ బలవంతం చేస్తే పల్లెటూరి పిల్ల ఏం చేస్తుంది చెప్పండి? పైగా ఒకసారి కాలు జారిం తర్వాత యిక కాదంటే పెళ్ళి చేసుకోడేమోనని కూడా భయపడి వుంటుంది. తీరా పెళ్ళి రేపు అనేంతవరకూ ఆ పిల్లతో తన పశువాంఛ తీర్చుకుంటూ వచ్చిన ఆ దుర్మార్గుడు తెల్లవారితే పెళ్ళి అనగా ఆ రోజు రాత్రి తన ఒళ్ళో పడుకుని వున్న ఆ పిల్లకు మత్తు మందు యిచ్చి పెళ్ళికి తెచ్చిన వెండి సామాన్లూ, నగలూ, బట్టలూ, యింకా యింట్లో వుండే వెండి బంగారు వస్తువులూ అన్నీ రెండు మూడు పెట్టెల నిండా తీసుకుని వెళ్ళి పోయాట్ట."

"ఆ!—హారి దుర్మార్గుడా! మరి ఆ పిల్ల గతో?"

"అధోగతి!"

"అయితే అన్ని పెట్టెలూ ఒక్కడు ఎట్లా తీసుకెళ్ళాడండీ?" అన్నాను నాకు సందేహం వచ్చి.

"అదేనమ్మా చెప్పొస్త!....వాడొక్కడు కాదుగా! అలాంటి దొంక ముఠా వుందిట. ఒక్కో యింటి లోతుపాతులూ, వివరాలూ తెలుసుకుని ఆ యింట్లో బంధువుల్లా వచ్చి తిష్టవేసి యిట్లాంటి దొంగతనాలు చేస్తున్నారట. ఆ పిల్ల తల్లిదండ్రుల ఘోష చెప్తూంటే గుండె తరుక్కుపోతుంది."

"హయ్యో! హయ్యో! ఎంత ఘోరం! యింతకీ ఆ పిల్లచచ్చింది ఏమైందీ?"

"అది చావబోయిందట బావిలో దూకి. ఎట్లాగో బయటికి తీసి బ్రతికించారట. యిక ఆ వూర్లో తలెత్తుకోలేక ఆ పిల్లను తీసుకుని వూరు విడిచి వెళ్ళిపోయారట....యింతకీ ఎందుకు చెప్పొచ్చానంటే బంధువులమని కూడా వస్తున్నారు దొంగలు."

"చూశావంటే! యిందాక మీ బావగారు ఫోన్లో నిష్ఠురాలు ఆడాడు, ఘూర్కా చేత గెంటించారని అంటివే! యిప్పుడీ కథ వింటే బంధువుల మంటూ వచ్చిన వాళ్ళ ముఖంమీద ఉప్పు నీళ్ళు చల్లాల్సిందేగా! వీళ్ళ క్కోపాలొస్తే నన్నేం చేస్తాయి? నేనిక చస్తే బంధువు అనే వాడిని గేట్లోపల కాలు పెట్టనివ్వను. దొంగ వెధవలు! బంధువులట బంధువులు!" అంటూ మా అత్తగారు బంధురూపంలో వచ్చే దొంగల్ని దుయ్యబడుతూ వుంటే నేను సంతకాలు చేసిన పేపర్లు తీసుకుని, మేనేజరు తృప్తిగా ఒక్క చిటికె ముక్కుపొడి పీల్చి ఆఫీసు కెళ్ళిపోయాడు.

మేనేజర్ వెళ్ళిపోగానే కాస్త నడుం వాలుద్దామని వంటింటి వసారా వేపు వెళ్ళబోతున్న మా అత్తగారు, "అవ్వా!" అనే పిలుపు విని వెనక్కి తిరిగింది.

ఇరవై ఏండ్ల కుర్రాడు, సూటూబూటూ వేసుకుని టిప్‌టాప్‌గా చేతులో చిన్న సూట్‌కేస్‌తో, చిరునవ్వుతో మా అత్తగారి వేపు చూస్తూ నిలబడ్డాడు. ఎవరో ఆ కుర్రాడు నాకూ తెలీలేదు—బహుశా మా అత్తగారి బంధుకోటిలో వాడేమో, ఆమెకు తెలుసు కాబోలు అనుకుని ఆమె వేపు చూశాను. ఆమె నా కంటే అయోమయంగా ఆ కుర్రాడి దగ్గిరకెళ్ళి ఎగాదిగా చూసి, "ఎవడ్రా నువ్వు? ఒరే గోపాలూ! ముందు వీణ్ణి బయటిగ్గెంటూ! అవ్వా అట అవ్వా!....దొంగ వెధవ, నడువు ముందు బయటికి," అంటూ ఆవేశంతో మా అత్తగారు ఆ వచ్చిన కుర్రాణ్ణి తరుముకుంటూ బయట వరండాలోకి పోయింది.

ఆ కుర్రాడు వెలవెలబోతూ, వెనక్కి వెనక్కి అడుగులు వేసుకుంటూ వెళ్ళి, ఒక్క క్షణం నిర్ఘాంతపోయి నిలబడ్డాడు. వెంటనే తెప్పరిల్లి, "అదేం టవ్వా! నేను పరాంకుశంగారి మనవణ్ణి. చిన్నప్పుడు మీ ఒళ్ళో కూర్చొని ఆడుకునేవాణ్ణి...."

"అవునవును! నా ఒళ్ళోనే ఆడుకున్నావులే దొంగ వెధవా! నీ దొంగ టక్కులు నేను తెలుసుకోలేననుకున్నావా? నడువు ముందు బయటికి. యిదేం పల్లెటూరు కాదు మోసం చెయ్యడానికి. పోతావా? గెంటించమంటావా?" అంటూ మా అత్తగారు గర్జించారు.

ఆ కుర్రాడు గుడ్ల నీళ్ళు కుక్కుకుని మారుమాట్లాడకుండా గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు.

ఓవైపు నా అంతరాత్మ ఎందుకో ఆ కుర్రాడు దొంగకాదు బంధువులబ్బాయేనని ఘోష పెడుతోంది. మా అత్తగారికెట్లా నచ్చ చెప్పడం? అసలే దొంగల భయంతో మతి చెడివున్న మా అత్తగారికి ఆ సమయంలో నేనేం చెప్పినా నన్నుకూడా నెక్సలైట్ అని అనుమానించే స్థితిలో వున్నది.

"చూడవే! దొంగ వెధవ, బంధువట బంధువు! పైగా చిన్నప్పుడు చూశానట! వీడి




ముక్కూ మొఖమూ నాకు తెలీదు," అని ఆమె అంటూంటే టెలిఫోన్ మోగింది. మావారు చేశారు. ఆ కుర్రాడు నేరుగా మా వారి దగ్గిరి కెళ్ళి మా అత్తగారు చేసిన మర్యాద చెప్పాట్ట. పెద్దామె ఆమె ఏదో అస్తావిస్తంగా మాట్లాడితే, నీ తెలివేమైంది? అంటూ నన్ను చీవాట్లు పెట్టారాయన. 'రేపు చూడమ్మత్తకు తెలిస్తే, కొడుక్కూ మనం చేసిన మర్యాదకు ఎంత బాధ పడుతుంది!' అని మావారు అంటూంటే అంత వరకూ ఏదో గుర్తుచేసుకోడానికి అవస్థ పడుతున్న నాకు, ఆ కుర్రాడెవరో చటుక్కున స్ఫురణ కొచ్చింది. ఫోన్ పెట్టేసి మేడమీది కెళ్ళి ఫోటో ఆల్బమ్ తీసుకొచ్చి మా అత్తగారికి ఓ గ్రూప్ ఫోటో చూపించాను. ఆ ఫోటో యిరవై యేండ్ల క్రితం ఆమె తిరుపతి వెళ్ళినప్పుడు వాళ్ళ బంధుకోటితో తీయించుకున్నది.

"మీ ఒళ్ళోవున్న పిల్లవాడు చూడమ్మ కొడుకూ, పరాంకుశం మనవడూ అని చెప్తాండే వారు. అతనేనా యీ కుర్రాడూ?" అంటూ గుర్తుచేశాను, ఆమె ఒళ్ళోవున్న చిన్న పిల్లవాణ్ణి చూపుతూ.

"ఆ! అవునే! చూడమ్మ కొడుకు ప్రభాకరం! వీడేనా వాడూ? ఆ! నిజమే, నిజమే. వాడే వీడు.... యిప్పుడు గుర్తొచ్చింది. చూడమ్మ పోలికలు వాడి ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపించాయి. అయ్యో పాపం! ఎంత తిట్టాను. ఏమిటో నాకు మతిపోయిందా కాసేపూ. చిన్నప్పుడీ వెధవ నా ఒళ్ళో కూర్చుని వాళ్లమ్మ పిల్చినా వెళ్ళేవాడు కాడు. ఛా ఛా, ఎంతపొరపాటు చేశాను! బిడ్డను ఎర్రటి ఎండలో మంచి నీళ్ళుకూడా యివ్వకుండా తరిమేశానే! గేటు దాకా వెళ్ళి చూడవే! వున్నాడేమో!" అన్నారు.

నాకో వైపువచ్చే నవ్వు ఆపుకుంటూ "ఆ కుర్రాడు నేరుగా మీ అబ్బాయి దగ్గిరికే వెళ్ళి జరిగిందంతా చెప్పాట్ట," అన్నాను.

"ఏమిటీ! యీ సంగతి అబ్బాయికి తెలిసిందా?"

"తెలియడమేకాదు, మధ్య నేను చీవాట్లు తిన్నాను. చూడమ్మ పిన్ని ఎంతబాధ పడుతుందోనని ఆయన చాలా నొచ్చుకున్నారు."

"యింతకీ వాడు అక్కడే వున్నాడా వెళ్ళిపోయాడా?"

"యీ పాటికి వెళ్ళే వుంటాడు. మళ్ళీ ఏ ముఖం పెట్టుకుని యిక్కడికి వస్తాడు," అన్నాను.

మా అత్తగారు తన తెలివి తక్కువకు ఆరోజు సాయంకాల దాకా తన్ను తాను తిట్టుకుంటూనే వున్నారు. మధ్య మధ్య పరాంకుశం గొప్పతనాన్నీ, చూడమ్మ మంచితనాన్నీపొగుడుతూ....సాయంకాలం కాఫీలవేళకు మాఅత్తగారొక చేత్తో పాలగ్లాసూ మరో చేతులో పాలు చల్లార్చేందుకు మరొక గిన్నె పట్టుకుని ముందు వేపు హాల్లోకొచ్చి, "కృష్ణా" అంటూ సోఫాలో కూర్చున్నారు, గ్లాసు గిన్నె ముందున్న టేబిల్ మీద పెట్టి.

పోర్టికోలో ఏదో కారాగింది. "కారొచ్చినట్లుంది, నా మనవడొచ్చాడా? చూడూ!" అన్నారు మా అత్తగారు.

"మీ మనవడికి యివ్వాళ రేపూ కూడా మెటర్నెటీ హాస్పిటల్లో డ్యూటీవుంది. ఎల్లుండి యింటికి వస్తానన్నాడు," అని నేనంటూండగానే పోర్టికోలో నుంచి టాక్సీ ఒకటి వెళ్ళిపోయింది. ఆ టాక్సీలో వచ్చిన ఒక ఆడ, ఒక మగ, యిద్దరూ చేతుల్లో చెరో పెట్టె పట్టుకుని లోపలి కొచ్చారు.

వాళ్లెవరో నాకు గుర్తురాలేదు. మా అత్తగారు కూడా కండ్లు చిట్లించి చూస్తూ వాళ్ళిద్దర్నీ గుర్తుపట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎందుకయినా మంచిదని, "రండి రండి కూర్చోండి!" అన్నారు ముందు జరిగిన పొరపాటు సరిదిద్దుకుంటూ మా అత్తగారు.

"ఎవరర్రా మీరూ? నాకు గుర్తు రావటం లేదూ!" అన్నారు చివరకు వుండబట్టలేక మా అత్తగారు. వాళ్ళిద్దరూ పక్కున నవ్వి, "అదేంటవ్వా! మమ్మల్ని మర్చిపోయావా? నేను మీ అక్కగారి ఆడబిడ్డ మనవణ్ణి. యిది నా భార్య. మీ పుట్టింటి ఆడబడుచే యిది"—అన్నాడు.

తన పుట్టింటి పేరు విన్న మా అత్తగారు సంతోషంతో చివాల్న లేచారు. ఆ వచ్చినావిడ దగ్గిర కెళ్ళి, ఆవిడ చెయ్యి పట్టుకుని "ఏమే! మా అక్క ఆడబడుచు మనవరాలా! పెళ్ళికి మమ్మల్ని పిలవకుండా చేసుకున్నారా" అంటూ సరసం ఆడి, "చూడంగానే గుర్తుపట్టలేకపోయానర్రా! చిన్నప్పుడు చూశానాయె! ఏమనుకోవాకరా మీ రెవరని అడిగినందుకు," అంటూ ముందు జరిగిన పొరబాటు మరోసారి దిద్దుకున్నారు, మా అత్తగారు. "అన్నట్లు నీ పేరు మర్చిపోయారా!"

"నా పేరు కృష్ణమూర్తి. కిట్టూ, కిట్టూ అంటూండేవారు, మీ అక్కగారూ, మీరూ."

"ఆ! అవునవును, యిప్పుడు జ్ఞాపకం వచ్చింది. నువ్వు జానకమ్మ రెండో మనవడు కిట్టువా!" అన్నారు ఏదో గుర్తుకు తెచ్చుకుంటూ. అవునన్నట్లు తలూపాడు అతను.

మా అత్తగారు తక్షణం కనుబొమలు చిట్లించి, "తెలీకడుగుతా, ఏమీ అనుకోవాకా. నువ్వు చిన్నప్పుడు వూరికే దొంగతనాలు చేస్తున్నావని నిన్ను తీసుకెళ్ళి చెంగల్పట్టు జైల్లో వేశారని మా అక్క చెప్పినట్టు గుర్తు" అన్నారు.

"అబ్బెబ్బే! ఆ జానకమ్మ మనవడు కిట్టూ వేరు! మీరు పొరపాట్న వినివుంటారు. మీ అక్కగారి మరో ఆడబడుచు తోడికోడలు జానకమ్మ మనవడు వాడు— యిప్పుడు బుద్ధిగానే ఉద్యోగం చేస్తున్నాడు."

"అట్లాగా! నా తెలివి మండ తిక్కముండని, మిమ్మల్ని వచ్చినప్పట్నుంచీ ప్రశ్నలేసి చంపుతున్నాను. ముసల్దాన్ని గుర్తు లేక ఏదో అడిగిందానికి ఏమీ అనుకోకరా!" అంటూ క్షమాపణ చెప్పుకున్నారు మా అత్తగారు.

వాళ్ళిద్దరికీ కాఫీ తీసుకురమ్మని నాతో మా అత్తగారు కండ్లతోనే చెప్పేశారు.

నేను లోపల్నుంచి రెండు కప్పుల్లో కాఫీ తీసుకొచ్చి వాళ్ళ ముందు పెట్టాను.

"అయితే యింత త్వరగా వెళ్ళిపోతారర్రా? లీవు లేకపోతే మళ్ళీ లీవుకోసం రాసుకోవచ్చులే! రాకరాక వచ్చారు. యీ ఒక్క రాత్రీ వుండి తెల్లారగట్ల బండికి వెళ్ళిపోతామంటున్నారే! ఎంత కిలాడీలో చూశావా! విజయనగరంలో బయల్దేరి పదిహేను రోజులైందట. రామేశ్వరం, కన్యాకుమారీ, మధుర, బెంగుళూరు అన్నీ చూసుకుని వస్తున్నారట. మనింట్లో రెండురోజులు కూడా వుండేందుకు వీల్లేకుండా ఒక్క పూట మాత్రం మిగుల్చుకొచ్చారు. ఎంత గట్టివాళ్లో చూశావా!" అని మా అత్తగారు నాతో అంటూంటే, "ఎల్లుండి ఆఫీసులో జాయిన్ కావాలి. లేకపోతే వుంటానికేం!" అన్నది అతని భార్య.

ఆవిడ వేసిన మేకప్ నా కెందుకో వికారంగా కనిపించింది. ముఖం నిండా పౌడరు, పెదాలకు లిప్‌స్టిక్, కండ్లకు వికారంగా కాటుక, కనుబొమలు దిద్దడం అంతా వీధిభాగోతం మనిషిలా కనిపించింది.

మా అత్తగారు నన్ను వెళ్ళి ఆవిడ పక్కన కూర్చోమని కండ్లతో రెండు మూడు సార్లు చెప్పారు. అయినా ఎందుకో ఆవిడ పక్కన కూర్చోడానికి మనస్కరించక మా అత్తగారి పక్కనే కూర్చున్నాను.

"అయితే యింతకీ యింకా పిల్లా జెల్లా లేరన్న మాట! అదేమిర్రా పెళ్ళయి పదేళ్ళంటున్నావ్! పోనీ రామేశ్వరం వెళ్ళారు,అక్కడ నాగప్రతిష్ట చేస్తే బాగుండేదిగా? మీలాగే పదేళ్ళూ, పదిహేనేళ్ళూ కూడా పిల్లలేనివాళ్ళు, వెళ్ళి నాగప్రతిష్ట చేసివచ్చి ఏడాది తిరక్కుండానే పండులాంటి పిల్లల్ని కన్నారు."

మా అత్తగారి మాటలకు ఆవిడ సిగ్గుపట్టం కూడా నాకు వివరంగా కనిపించింది.

"వారికి దేవుడంటే నమ్మకంలేదు, అవ్వగారూ!" అన్నది ఆవిడ నవ్వుతూ.

ఆ మాట విన్న మా అత్తగారి నెత్తిమీద పిడుగు పడ్డట్లయింది.

"హరిశ్రాష్టుడా! నాస్తికుడవైనావా? ఇదెప్పట్నుంచీ? మీ అవ్వ జానకమ్మ కెంత భక్తి. ఆమె పేర పార్థసారథిస్వామి గుళ్లో తళిగ వేయించేవాడు మీ తాత! ఎన్నివందల మందికి భోజనాలు పెట్టేవాళ్ళు! ఏంపూజలూ! ఏం వ్రతాలూ! ఆమె చెయ్యని వంటూ లేవు. అట్లాంటి తులసివనంలో గంజాయి మొక్కలాగా నువ్వెట్లా పుట్టావురా!" అని మా అత్తగారు అతన్ని చీవాట్లు పెడుతూంటే అతను ఖంగారు పడుతూ. "అబ్బే, అదేం లేదవ్వా! నాకే భక్తి జాస్తి! యిది వూరికే నన్ను ఏడిపిస్తుంటుంది. రామేశ్వరంలో నాగప్రతిష్ట చేసే వస్తున్నాం," అన్నాడు లేచి నిలబడుతూ.

"అవునవ్వా, నేను తమాషాకన్నాను. అసలు అందుకే యిల్లు బయల్దేరింది," అన్నది ఆవిడా లేచి నిలబడుతూ.

"అట్లాగా! సరే యింకేం ఒచ్చే ఏడాదికి పండులాంటి బిడ్డ నెత్తుకునిరండి మా యింటికి. అది సరేగానీ ఏం లేచారు?"

"ఏం లేదు. మా సామాన్లు పెట్టుకోడానికీ వుంటానికీ ఏదైనా రూము వుంటే," అని అతను అంటూండగానే, "ఏదేనా రూమేం ఖర్మంరా! వెనకాల కొత్తగా కట్టాం గెస్టు రూము. లక్షణంగా అందులో వుండచ్చు మీరు. ఆ రూము చూపించవే, వాళ్ళకూ!" అంటూ నాకు పురమాయించారు.

నేను వాళ్లిద్దర్నీ వెనక గెస్టు రూములో వదిలి మా అత్తగారి దగ్గిర కొచ్చాను. మా అత్తగారు నా చెవి దగ్గిరకొచ్చి, "అదేంటే! దాని మేకప్పు అదీ, ఎంత వికారంగావుందో చూశావా! మగాడికి ఆడవేషం వేసినట్లుండ్లా? అయినా యీ వయసులో దానికా షోకేమిటే! వాడైనా చెప్పగూడదూ! వుండు, వెళ్ళేలోగా

దానికి బాగా బుద్ధి చెప్పి మరీ పంపుతాను. అట్లాంటి యింటికి రావలసిన కోడలా యిది! ఛీ ఛీ," అని అంటూంటే, ఎవరో ఒకాయన గొడుగూ, కళ్ళజోడూ, పాతకాలం పంచెకట్టూ, చింపికోటుతో చెప్పులు విడిచి లోపలికొచ్చాడు.

మా అత్తగారూ, నేనూ, ఆయన్ను ప్రశ్నార్థకంగా చూట్టంతో ఆయనే సోఫాలో కూలబడుతూ, "అమ్మా, కాస్త మంచి తీర్థం



యిప్పించండి. నేను మీ తండ్రిగారి స్నేహితుడు కరణం కామయ్యగారి కొడుకునమ్మా!" అంటూ, తను తాను పరిచయంచేసుకున్నాడు. వాళ్ళ తండ్రిగారి పేరు వినగానే మా అత్తగారి ప్రాణం లేచొచ్చినట్లయింది.

"అట్లాగా! కూర్చోండి. ఏమిటో మిమ్మల్నంతా చూసి యాభై ఏండ్ల పైమాటే అయింది. అంతా బాగున్నారా? ఎంత మంది పిల్లలు?"

"నలుగురండీ. యిద్దరాడా, యిద్దరు మగ," అని అతను మా అత్తగారితో మాట్లాడుతూంటే నేను మంచినీళ్ళ కోసం వెనక వేపు కెళ్ళాను.

ఆ వచ్చిన భార్యా భర్తలు ఏదో గుసగుసలాడుకోడం వినిపించింది. నన్ను చూసి ఆగిపోయారు. నేను మంచినీళ్ళు తెస్తూంటే, అతను వచ్చి, "ఎవరండీ, ఆ వచ్చిన మనిషి? మీకు తెలుసా?" అని అడిగాడు ఆతృతగా.

"అబ్బే లేదండీ! మా అత్తగారి తండ్రిగారికి తెలుసట," నా మాటలకు భార్యా భర్తలు ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు.

"చూడండీ! అతనొక పెద్ద దొంగ. అతనిట్లాగే వచ్చి బంధుత్వాలు కలిపి యింట్లో దొంగతనాలు చేసి డబ్బూ నగలూ పట్టికెళ్ళిపోతూంటాడు. యీ సంగతి మాకు తెలుసని అతనికి తెలీదు లెండి. మాతో పాటే రైల్లో

వచ్చాడు. మా ఆవిడ ఒంటిమీద వున్న నగల మీద కన్నేశాడు. మేం రైలు దిగినప్పట్నుంచి మమ్మల్ని వెంటాడుతున్నాడు. మీ అత్తగారి వూరు కరణం కొడుకూకాదు ఏమీ కాదు. అతని వుద్యోగం యిదే నని మాకు రైల్లో అతనికి తెలిసినవాడు రహశ్యంగా చెప్పి మమ్మల్ని రక్షించాడు. ఒట్టి దొంగ వెధవ. వెంటనే పంపించెయ్యండి. యిక్కడ మేం వున్నామని గూడా తెలియ నివ్వకండి. అటునుంచి అటే పంపించెయ్యండి. వెంటనే వెళ్ళి పెద్దామెతో పక్కకు పిల్చి మేం చెప్పిందంతా చెప్పండి. లేకపోతే మీకూ మాకూ కూడా డేంజర్!" అన్నాడు కిట్టూ.

నా కెందుకో విపరీతంగా భయం వేసింది. యిదేదో డిటెక్టివ్ నవల్లా వుందే, అనుకుని మంచినీళ్లు తీసుకెళ్ళి అతని ముందు పెట్టి మా అత్తగార్ని పక్క రూములోకి పిలిచి, కిట్టూ చెప్పిందంతా చెప్పాను.

"ఉండు! నన్ను బురిడీ కొట్టించాలని చూస్తాడా మా అబ్బ పేరు చెప్పి! దొంగ వెధవ," అని మా అత్తగారు మండిపడుతూ హాల్లో కెళ్ళారు. ఆశ్చర్యం! అత నక్కడ లేడు!

"ఏడీ? పారిపోయాడేవ్! చూశావా! హవురా! హవురా! ఎంతమోసం! పట్టపగలు దొంగలు తిరిగేకాలం వచ్చిందే! మంచి నీళ్ళ గ్లాసు ఎత్తుకుపోయాడా? వుంచాడా చూడు," అంటూ సోఫా పక్కనున్న గ్లాసుచూసి, "వుంచాడే, వాడి పుణ్యమాయిరి! నేనెంత తిక్కముండనోచూడు! మా అక్క మనవడూ, కోడలూ యిప్పుడే వచ్చారూ, వాళ్లూ రాత్రి కుండి రేపు ప్రొద్దుటే వెళ్ళిపోతున్నారూ, వాళ్ళతోకూడా రాత్రికి భోంచేసి తెల్లారగట్ల వెళ్ళొచ్చని చెప్పాను. సరే అన్నాడు. హవురా! హవురా! యింకెవర్ని నమ్మడం? దొంగకీ మనిషికీ తేడాలు తెలీని కాలం వచ్చిందే!" అంటూ మా అత్తగారు వెనకవేపు కిట్టూ వాళ్ళున్న దగ్గిరికి కెళ్ళారు.

"చూశావురా, కిట్టూ! నువ్వు సమయానికి చెప్పకపోతే మా గతి ఏమయ్యేదో నాయనా. దేవుడిలా వచ్చావు! పైగా మీ యిద్దరితోబాటు రాత్రి భోజనానికి వుండమని బలవంతంచేశాను, తిక్కముండను. మేం కనుక్కున్నామని పసికట్టాడో ఏమో, తిరిగి చూసేసరికి కాలికి బుద్ధి చెప్పాడ్రా!"

"అట్లాగా?" అంటూ ఒక్కసారి గతుక్కుమన్న కిట్టూ, అతని భార్య ఒకరి ముఖాలు ఒకరు చూవుకున్నారు.

"ఏమిట్రా ఆలోచిస్తున్నారు?"

"అబ్బే ఏం లేదవ్వా! అసలు వాడెవడై వుంటాడూ అని ఆలోచిస్తున్నాం."

"అదేరా! యిప్పుడంతా ఏదో లైట్లు అంటున్నారే! బహుశా వాళ్ళల్లో వాడేమో! వాళ్ళంతా పెద్ద మనుషుల్లాగానే వస్తారటగా?"

"అవునవును. మళ్ళీ అతనొస్తే లోపల వదలొద్దని ఘూర్కాతో మీరే వెళ్ళి చెప్పండవ్వా! చాలా డేంజర్ మనిషి," అన్నాడు కిట్టూ, భార్యవైపు చూస్తూ.

"ఓయమ్మో! అట్లాగా? అయితే యిప్పుడే చెప్తాను," అంటూ హడావిడిగా హాల్లో కెళ్లారు మా అత్తగారు.

కిట్టు నన్ను చూసి, "చూడండీ, మేమిద్దరం అట్లా తోట్లోకి వెళ్ళి కాసేపు తిరిగి వస్తాం," అన్నాడు.

"అలాగే. రూము తాళం వేసుకెళ్తారా?" అన్నాను.

"అబ్బే! మనింట్లో మనకి తాళా లెందుకండీ?" అంటూ, "రావోయ్!" అని గదిలో ఏదో సర్దుతున్న పెళ్లాన్ని కేకేశాడు.

నేను హాల్లో కెళ్ళేసరికి మా అత్తగారు ఘూర్కాతో మాట్లాడి లోపలికి వస్తున్నారు.

ఆమె వెనకాలే అంతకు ముందొచ్చిన కరణం హడావిడిగా వచ్చాడు.

అతన్ని చూడగానే మా అత్తగారికి ఒళ్ళు తెలీని కోపం వచ్చింది.

"దొంగ వెధవా! మళ్ళీ వచ్చావా?" అని యింకా ఏమో ఆమె అనబోతూంటే అతను నవ్వుతూ, "దొంగ వెధవ లెవరో మీకిప్పుడే తెలుస్తుంది. కమాన్!" అంటూ తన వెనకాలే వచ్చిన పోలీసు సిబ్బందితో యింటి వెనక వేపుకు పరుగెత్తాడు. ఒక్క క్షణం మా అత్తగారికీ నాకూ గుండె ఆగినట్లయింది.

గుడ్లు తేలేసి మేం చూస్తుండగానే వాళ్లున్న రూమంతా వెతికి వాళ్ళ పెట్టెలు రెండూ పట్టుకొచ్చారు.

ఆ పెట్టెల్లో ఒట్టి చెత్త కాగితాలూ, ఒక పేంటూ, ఒక షర్టూ వున్నాయి.

"దొంగ వెధవలు కాస్తలో తప్పించుకుపోయారు!" అన్నాడు కరణంగా వచ్చిన సి. ఐ. డి. తను పడ్డకష్టం అంతా వృధా అయినందుకు బాధపడుతూ.

భార్యా భర్తలుగా వచ్చిన యిద్దరూ మగవాళ్ళేనట!

బస్సులో ఎక్కి పారిపోయిన నెక్సలైట్లు వీళ్ళేమోనని అనుమానిస్తున్నారట పోలీసులు. ఆమాటవిన్న మా అత్తగారు గుండె బాదుకుంటూ, "ఓయమ్మో! ఓయి నాయనో! యింతసేపూ నేను దొంగలతో మాట్లాడానే! నేను దొంగలకి మర్యాదచేశానే! నా తల తిరుగుతూందే! నీళ్లే!" అంటూ 'ఫిట్'వచ్చి పడిపోయారు సోఫాలో.

"పాపం పెద్దమ్మగారికి పెద్ద షాకే! డాక్టర్ని పిలిపించమంటారా అమ్మా?" అని అడిగాడు సి. ఐ. డి. కరణంగారు.

"ఒద్దండీ! యీ ఫిట్సు ఆమెకు అప్పుడప్పుడూ వస్తూంటాయి, యిల్లాంటి సమయాల్లో. కాసేపటికి ఆమే లేచికూర్చుంటారు."

"అలాగా! అయితే నేను వెళ్తానమ్మా! యిక ఆ యిద్దరూ పారిపోయినట్టే! నేను రావడం ఎట్లాగో పసిగట్టి, లోపలి కెళ్ళిన మీతో వాళ్ళు నేను దొంగనని చెప్పివుంటారని తెలిసే, మీ అత్తగారితో మీరు నా విషయం చెబుతూన్నప్పుడు నేను పక్క కాంపౌండు కెళ్ళి పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశాను. నేను చెప్పకుండా వెళ్ళింది పోలీస్‌కోసమేనని వాళ్లు పసిగట్టే, నే వచ్చేలోగా పారిపోయారు. వాళ్ళిద్దర్నీ నేను మూడురోజుల్నుంచీ వెంటాడుతున్నానమ్మా? తోట్లో నుంచి ఆ వెనకాల గుడిసెల మీదుగా తప్పించుకుపోయి మొఫెసల్ బస్సు పట్టుకోనుంటారు. త్వరగా వెళ్లాలి. పాపం, మీకు శ్రమ కలిగించాం, క్షమించండి!" అంటూ సి. ఐ. డి, అతని వెనకాల పోలీసులూ వెళ్ళిపోయారు త్వరత్వరగా.

మా అత్తగారు ఫిట్‌లో నుంచి తెప్పరిల్లి, యీ లోకంలో పడ్డానికి అరగంట పట్టింది.

——:o:——